

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలి
విద్యార్థులకు పాఠ్యాంశాల భోదనతోపాటు, కెరీర్ గైడెన్స్ ఇవ్వాలని కలెక్టర్ సూర్యకుమారి ఉపాధ్యాయులను ఆదేశించారు. - 8లో



విద్యుత్ చోరులకు షాక్..!
విద్యుత్ చోరులపై అధికారులు నిఘా పెంచారు. విద్యుత్ అక్రమంగా వినియోగిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. - 8లో



జాతర నిర్వహణపై సమీక్ష
ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన జామి యల్లారమ్మ జాతర ఈనెల 26 నుంచి 28వరకు జరగనుంది. ఏర్పాట్లపై అధికారులు సమీక్షించారు. - 8లో

న్యూస్‌రీల్

ఇంటర్నెట్ సదుపాయం కల్పనలో ఏపీ భేష్

● మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు

విజయనగరం: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నెట్ సదుపాయం కల్పనలో దక్షిణాది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలవడం అభినందనీయమని మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేరళ రాష్ట్రం 94 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, 45 శాతంతో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉందన్నారు. అన్ని పాఠశాలలకు నెట్ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నందున, త్వరలోనే మొదటి స్థానానికి చేరే అవకాశం ఉందన్నారు. ఢిల్లీ, పాండిచ్చేరిల సరసన నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రపంచస్థాయి నైపుణ్యాలు సాధించేందుకు ఇంటర్నెట్ సదుపాయం, ట్యాబ్‌లు అందుబాటులోకి రావడం అన్నది ప్రాథమిక అవసరంగా పేర్కొన్నారు.

రామతీర్థంలో లడ్డూ ప్రసాదం తయారీ

● శివరాత్రి ఉత్సవాలకు 24వేల లడ్డూలు సిద్ధం



సిద్ధం చేసిన లడ్డు ప్రసాదాన్ని పరిశీలిస్తున్న ఈఓ ప్రసాదరావు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఈ నెల 18 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు దేవస్థాన అధికారులు బుధవారం లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన 300 మంది శ్రీవారి సేవా భక్తులు రాములోరి కల్యాణ వేదిక ప్రాంగణంలో లడ్డూ ప్రసాదాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన ఈఓ ప్రసాదరావు మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొత్తం 24వేల లడ్డూలను సిద్ధం చేశామని చెప్పారు. ఒక్కో లడ్డూ రూ.15 చొప్పున విక్రయిస్తామని, ప్రసాదం విక్రయానికి రెండు కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. పులిహోర ప్రసాదం పంపిణీకి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. శివరాత్రి ఉత్సవాల విజయవంతానికి ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, సేవా సంఘాల భక్తులు పాల్గొన్నారు.

మార్చి 31న న్యాయవాదుల సంఘం ఎన్నికలు

విజయనగరం లీగల్: విజయనగరం న్యాయవాదుల సంఘం ఎన్నికలు మార్చి 31న జరుగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో ఉన్న అన్ని న్యాయవాదుల సంఘాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేలా నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చేనెల 15 న నామినేషన్లు దాఖలు, 20న నామినేషన్ల ఉపసంహరణ, 31న ఓటింగ్ ప్రక్రియ, అదే రోజు ఫలితాలు ప్రకటించాలని పేర్కొంది. అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, కల్చరల్, స్పోర్ట్స్ సెక్రటరీ, సంయుక్త కార్యదర్శి (మహిళా) పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

18న అండర్-19 చెస్ క్రీడాకారుల ఎంపికలు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్నట్టు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.వి.జ్వాలాముఖి తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి విజయనగరంలోని ఫైర్‌చెస్ స్కూల్‌లో జరిగే ఎంపిక పోటీల్లో 19 సంవత్సరాలలోపు వయస్సు గల క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు విధిగా తమ వయసు ధ్రువీకరణపత్రాన్ని వెంట తీసుకురావాలని స్పష్టం చేశారు. ఆ రోజు ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికచేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహాశివరాత్రికి 500 ప్రత్యేక బస్సులు

నెల్లిమర్ల రూరల్: మహాశివరాత్రి సందర్భంగా జోనల్ పరిధిలో శైవ క్షేత్రాలను దర్శించుకునే భక్తుల కోసం సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు సేవలందిస్తాయని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జోనల్ పరిధిలోని 5 జిల్లాలకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించామన్నారు. విజయనగరం జిల్లాకు-80, విశాఖకు-150, అనకాపల్లికు-11, పార్వతీపురం మన్యంకు-70, శ్రీకాకుళం జిల్లాకు 90 ప్రత్యేక బస్సులను సాధారణ చార్జీలతో నడుపుతున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిర్వాసితుల త్యాగం అజరామరం



లింగాలవలసలో నిర్వాసితుల కాలనీ

- స్వగ్రామాలను ఖాళీ చేసిన విమానాశ్రయ నిర్వాసితులు
- అన్ని విధాలా వారికి అండగా నిలిచిన ప్రభుత్వం
- ఒక్కో కుటుంబానికి 5 సెంట్ల ఇంటి స్థలం
- రవాణా చార్జీలతో సహా రూ.9.20 లక్షల చొప్పున ఆర్థిక సాయం
- సకల సౌకర్యాలతో పునరావాస కాలనీల నిర్మాణం
- రూ.30 కోట్లతో గూడెపువలస, లింగాలవలస కాలనీల్లో వసతులు
- విశాలమైన రోడ్లు, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు
- ప్రశాంత వాతావరణంలో నిర్వాసితుల తరలింపు పూర్తి



గూడెపువలస నిర్వాసిత కాలనీ

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం.. ఉమ్మడి విజయనగరం జిల్లాకే కాదు ఉత్తరాంధ్ర ప్రాంతానికే మణిహారం కాబోతోంది!. భోగాపురం వద్ద సాకారం కానున్న ఈ విమానాశ్రయానికి అవసరమైన భూములను ఇచ్చిన నాలుగు గ్రామాల ప్రజల త్యాగం అజరామరమే!. వారి త్యాగానికి తగ్గట్టుగానే ప్రభుత్వం వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. నిబంధనల ప్రకారం పూర్తి స్థాయిలో పరిహారం, పునరావాసం (ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ) కల్పించింది. ప్రతి నిర్వాసిత కుటుంబానికి 5 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వడమే గాక ఆధునిక వసతులతో కూడిన కొత్త కాలనీలను నిర్మించింది. సుమారు రూ.30 కోట్ల నిధులతో మౌలిక సదుపాయాలను కల్పించింది. కలెక్టర్ ఎ.సూర్యకుమారి పర్యవేక్షణలో విజయనగరం ఆర్డీఓ. సూర్యకళ, భోగాపురం తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ప్రత్యేక కృషితో నిర్వాసితుల తరలింపు ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయింది. విమానాశ్రయం నిర్మాణ పనుల శంకుస్థాపనకు మార్గం సుగమం అయ్యింది.

తెరపైకి రెండు కొత్త ఊళ్లే...

నిర్వాసితులైన బొల్లింకలపాలెం, రెల్లిపేట, మరడపాలెం, ముడసర్లపేట గ్రామస్తుల సౌకర్యార్థం ప్రభుత్వం రెండు కొత్త ఊళ్ల (కాలనీలు)ను నిర్మించింది. మరడపాలెం గ్రామానికి చెందిన 223 కుటుంబాలకు, ముడసర్లపేట గ్రామానికి చెందిన 33 కుటుంబాలకు పోలిపల్లి రెవెన్యూ పరిధిలోని లింగాలవలసలో 25 ఎకరాల విస్తీర్ణంలోని ప్రత్యేక కాలనీలో ఆవాసం కల్పించారు. రెల్లిపేటకు చెందిన 65 కుటుంబాలకు, బొల్లింకలపాలెంకు చెందిన 55 కుటుంబాలకు గూడెపువలసలో 17 ఎకరాల పరిధిలో నిర్మించిన కాలనీ ఇప్పుడు కొత్తఊరు అయ్యింది. రెండు కొత్త ఊళ్లలో ఇప్పుడు 376 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారు స్వగ్రామాల నుంచి ఆయా ఊళ్లకు తరలివెళ్లడానికి రూ.50 వేల చొప్పున రవాణా చార్జీల సహా రూ.9.20 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించింది. అయినప్పటికీ గ్రామాల నుంచి కాలనీలకు తమ సామగ్రి, వస్తువులు, పాడి పశువుల సహా ప్రతి ఒక్కటి తీసుకెళ్లడానికి అధికారులు ఉచితంగా ట్రాక్టర్లను ఏర్పాటు చేయడం విశేషం. తాత్కాలికంగా ఉచిత భోజన సదుపాయం కల్పించారు. రెండు కాలనీల్లో వైద్య బృందాలను అందుబాటులో ఉంచారు. అవసరమైన వారికి వైద్యం అందిస్తున్నారు.



నిర్వాసితులతో ఆర్డీఓ సూర్యకళ, తహసీల్దార్ శ్రీనివాసరావు

ఉపాధి కల్పనకు కలెక్టర్ ప్రత్యేక చొరవ

నిర్వాసిత కాలనీలకు చేరుకున్న ప్రజలకు తక్షణ ఉపాధి కల్పించేందుకు కలెక్టర్ ఎ.సూర్యకుమారి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. డ్వామా పీడీ ఉమామహేశ్వరిని కాలనీలకు పంపించారు. ఆమె నివేదిక మేరకు బుధవారం నుంచే కొంత మందికి ఉపాధి హామీ పథకంలో స్థానికంగా పని కల్పించారు. కాలనీలకు సమీప ప్రాంతంలో వారికి జాబ్ కార్డులను అనుసంధానం చేశారు. మిగిలిన పథకాలను కూడా మార్పింగ్ చేస్తున్నారు.

మిగిలిన వారికీ పరిహారం

ప్రస్తుతం ప్యాకేజీ వర్తించని మరో 25 కుటుంబాలకు కూడా ఆర్థిక సాయం అందజేస్తాం. 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీ అందించే విషయంలో కోర్టు ఇచ్చే ఉత్వర్వుల మేరకు నిర్ణయం తీసుకుంటాం. వలస కార్మికుల సౌకర్యార్థం ప్రత్యేక స్థలం కేటాయించి జగనన్న కాలనీ మాదిరి ప్రత్యేక కాలనీ నిర్మిస్తాం.

– సూర్యకళ, ఆర్డీఓ, విజయనగరం

అన్నీ నిర్వాసితుల సమ్మతితోనే...

నిర్వాసితుల సమ్మతితోనే తరలింపునకు సంబంధించి అన్ని పనులూ పూర్తి చేశాం. తగిన గడువు తర్వాతనే తరలింపు ప్రక్రియను చేపట్టాం. 2021లోనే పరిహారం చెల్లించాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్వాసితుల విజ్ఞప్తి మేరకు పలుమార్లు గడువు పెంచుతూ వచ్చాం. సంక్రాంతి తర్వాత కొత్త కాలనీలకు వెళ్లిపోతామని నిర్వాసితులే చెప్పారు. అయినా, మరొక నెల గడువు ఇచ్చాం. కాలనీల్లో ప్రభుత్వం తరఫున చేయాల్సిన అన్ని రకాల పనులను పూర్తి చేశాం. పరిస్థితులు అనుకూలించక అక్కడక్కడ నిర్వాసితులు ఇళ్లను సకాలంలో నిర్మించుకోలేకపోయారు. త్వరలోనే అన్నీ పూర్తవుతాయి. మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా ఇబ్బందులు లేవు.

– కోరాడ శ్రీనివాసరావు, తహసీల్దార్, భోగాపురం

విశాలమైన ఇళ్లు నిర్మించుకున్నాం...



విమానాశ్రయం కోసం మా విలువైన భూములను కోల్పోయామనే బాధ ఉన్నప్పటికీ ఇప్పుడు ప్రభుత్వ సాయంతో విశాలమైన ఇళ్లను నిర్మించుకున్నాం. గతంలో ఇరుకు గదుల్లో ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. ఈ రోజు మంచి వసతుల మధ్య ఉన్నామంటే అది కేవలం ప్రభుత్వం చలువే.

– ఇంటి లక్ష్మి, నిర్వాసితురాలు, రెల్లిపేట గ్రామం

అన్ని సదుపాయాలు ఉన్నాయి



పునరావాస కాలనీలో అన్ని సదుపాయాలు ఉన్నాయి. వసతులతో కూడిన కాలనీ సిద్ధం చేశారు. బడి, గుడి, విద్య, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించారు. మాకు సంతోషంగా ఉంది.

– ఎర్రంశెట్టి పైడయ్య, నిర్వాసితుడు, రెల్లిపేట గ్రామం

భవిష్యత్‌లో మంచి అవకాశాలు



మా కాలనీకి సమీపంలోనే హోటళ్లు, ఐటీ పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని తెలిసింది. ఇవి వస్తే మా ప్రాంతం మరింత అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్న నమ్మకం మాకుంది. మాకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు వస్తాయి.

– ఎర్రంశెట్టి అప్పలనర్సమ్మ, నిర్వాసితురాలు, రెల్లిపేట గ్రామం

తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలి...



ఇంకా కొన్ని సదుపాయాలకు సంబంధించిన పనులు మా కాలనీలో పూర్తి చేయాల్సి ఉంది. అధికారులే ఇకపై కూడా పూర్తి చొరవ తీసుకొని వాటిని పూర్తి చేయాలి.

– ఎర్రంశెట్టి లక్ష్మి, నిర్వాసితురాలు, రెల్లిపేట గ్రామం

ఎక్కడికైనా రవాణా సౌకర్యం



ఇటు విజయనగరం, అటు విశాఖపట్నం ఎక్కడికి వెళ్లాలన్నా ఈ పునరావాస కాలనీకి రవాణా సౌకర్యం ఉంది. రెండు జిల్లాల కేంద్రాలకు మధ్య ప్రాంతంలో మా కాలనీ ఉండటం మాకెంతో ఉపయోగం.

– ముసర్ల సూరమ్మ, నిర్వాసితురాలు, ముడసర్లపేట గ్రామం

టౌన్‌షిప్ మాదిరిగా మౌలిక సదుపాయాలు...

గూడెపువలస, లింగాలవలస కాలనీల్లో దాదాపు రూ.30 కోట్లు వెచ్చించి విశాలమైన సీసీ రోడ్లు, మెయిన్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ అప్రోచ్ రోడ్లు, పిల్లల సౌకర్యార్థం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం నిర్మించింది. పార్కులు, కమ్యూనిటీ భవనాలు, కల్యాణ మండపాలు, గ్రామ దేవతల గుళ్లు, తాగునీటి సదుపాయం నిమిత్తం ఓవర్ హెడ్ ట్యాంకులు, ఇంటింటికీ కుళాయిలు ఉన్నాయి. పోస్టాఫీసు, బిజినెస్ కాంప్లెక్సులు, పశువైద్యశాలలు కూడా వచ్చాయి. చెత్త తరలింపు కేంద్రాలు, నిత్యం విద్యుత్ సరఫరా ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు.



లింగాలవలసలో అంగన్‌వాడీ కేంద్రం



లింగాలవలసలో ప్రాథమిక పాఠశాల



కాలనీలో పార్క్

ఎమ్మెల్సీ ఎన్నికకు జోనల్ అధికారుల నియామకం

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి రూట్, జోనల్ అధికారులను నియమించినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.సూర్యకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను రూట్ ఆఫీసర్స్‌గాను, జిల్లా అధికారులను జోనల్ అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. జోనల్ అధికారులు వెంటనే సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.
మార్చి 10, 11 తేదీల్లో ఉన్న పోలింగ్ బూత్‌లను తనిఖీచేసి 12న తేదీన నివేదిక సమర్పించాలని సూచించారు. 13వ తేదీన ఎన్నిక నిర్వహించనున్నందున 12వ తేదీ నాటికే పోలింగ్ సిబ్బంది, మెటీరియల్ చేరేలా జోనల్ అధికారులు బాధ్యతవహించాలని ఆదేశించారు. పోలింగ్ రోజున ప్రతి గంట గంటకు పోల్‌స్టేటస్‌పై నివేదిక సమర్పించాలన్నారు.

సజావుగా ఇంటర్మీడియట్ పరీక్ష

విజయనగరం పూల్‌బాగ్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు బుధవారం నిర్వహించిన 'నీతి, నైతిక విలువలు' పరీక్ష బుధవారం సజావుగా జరిగింది. పరీక్షకు 18,548 మందికి గాను 18,251 మంది హాజరయ్యారు. 297 మంది గైర్హాజరైనట్టు ఆర్ఐఓ ఎం.సత్యనారాయణ తెలిపారు. అలాగే, ఇంటర్మీడియట్ ఒకేషనల్‌కు సంబంధించి 5781 మందికి గాను 5,688 మంది హాజరయ్యారు. 93 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్ఐఓతో పాటు, డీఈసీ మెంబర్స్ ఎం.ఆదినారాయణ, ఎస్.రామకృష్ణ పర్యవేక్షించారు.

రెండుపూటలా ప్రయోగ పరీక్షలు

● జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు



మాట్లాడుతున్న డీఆర్ఓ గణపతిరావు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. ఈ నెల 20 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఒకేషనల్, ఈ నెల 26 నుంచి మార్చి7వ తేదీ వరకు జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పరీక్షల నిర్వహణపై తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో బుధవారం సమీక్షించారు. జిల్లాలోని 97 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఆయా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. విద్యార్థులకు తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. పరీక్ష ప్రారంభానికి అర్ధగంట ముందు నుంచి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఆర్ఐఓ సత్యనారాయణ మాట్లాడుతూ పరీక్షల పర్యవేక్షణకు 3 ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించామన్నారు. ఎలాంటి అవసరం పడినా ఆర్ఐఓ కార్యాలయం ఫోన్ 08922-237989 నంబర్‌ను సంప్రదించాలన్నారు. సమావేశంలో పోలీస్, ఆర్టీసీ, విద్యుత్ శాఖల అధికారులు, పరీక్షల కమిటీ సభ్యులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: లింగనిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి హెచ్చరించారు. గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం-1994 అమలుపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు, తదితర పరీక్షలకు ఉపయోగించాల్సిన యంత్రాలను లింగనిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతీస్కానింగ్ సెంటర్‌లో టారిఫ్‌చార్జీల బోర్డులను ప్రదర్శించాలని చెప్పారు. పీసీపీఎన్‌డీటీ చట్టంపై సఖిగ్రూపులు ద్వారా ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారి డాక్టర్ ఆర్.జగదీష్, ఘోష ఆస్పత్రి వైద్యులు వై.అరుణశుభశ్రీ, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సుజాత, రేడియోలాజిస్టు డాక్టర్ ఎల్.వి.వి.ప్రసాద్, పెథలాలజిస్టు డాక్టర్ శ్రీదేవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయలక్ష్మి, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ పి.రవికుమార్, డెమో చిన్నతల్లి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, నేచర్ సంస్థ ప్రతినిధి జి.కె.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్‌జిల్లా ఆర్చరీ పోటీలు



ఆర్చరీలో పాల్గొన్న విద్యార్థులు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు రోజులుగా నిర్వహించిన అంతర్ జిల్లా ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. విజేతలకు జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపుఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విజేతలందరూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీవీ రమణ, క్రీడల చీఫ్‌కోచ్ ఎస్.వెంకటరమణ, కోచ్‌లు గాంధీ, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు (వరుస నాలుగు స్థానాలు సాధించిన వారు) ఇలా...

అండర్-14 బాలికల విభాగం: బి.గాయత్రి (పశ్చిమ గోదావరి), కె.సాయిసుజన, డి.గీతిక (చిత్తూరు), శివదుర్గ (వైఎస్సార్ కడప)

అండర్-14 బాలురు: ఎస్.రామచైతన్య (విశాఖపట్నం), జి.వెంకటలోకేష్ (పొట్టి శ్రీరాములు నెల్లూరు), వై.నవీన్ (వైఎస్సార్ కడప), వై.ధీమంత్ ప్రసాద్ (చిత్తూరు)

అండర్-17 బాలికల విభాగం: ఎం.సంజన (చిత్తూరు), కె.దీపిక, టి.తీర్థప్రియ (వైఎస్సార్ కడప), జి.లహరి(విజయనగరం)

అండర్-17 బాలుర విభాగం: ఆర్.నాగేంద్రబాబు (విశాఖపట్నం), జి.భాస్కర్ (వైఎస్సార్ కడప), పి.వి.ఎస్.భరత్ (చిత్తూరు), కె.భరత్‌తేజ(విశాఖపట్నం)



విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జేసీ ఆనంద్

క్లుప్తంగా

దొంగతనం కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలుశిక్ష



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సన్యాసినాయుడు

చీపురుపల్లి: బంగారు ఆభరణాల దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో పట్టణంలోని సెగిడివీధికి చెందిన ముద్దాయి నక్క శివకు చీపురుపల్లి సివిల్ జడ్జి కోర్టు మెజిస్ట్రేట్ ఎం.విజయరామేశ్వరి 6నెలల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఎ.సన్యాసినాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సెగిడి వీధిలో నివాసం ఉంటున్న తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి ఇంట్లోని బీరువాలో నుంచి నాలుగుంపావు తులాల బంగారు ఆభరణాలు దొంగిలించుకుపోయారని బాధితుడు కిల్లంశెట్టి సూర్యప్రకాశ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గత ఏడాది సెప్టెంబర్ నెలలో ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి సెగిడివీధికి చెందిన నక్కా శివ ఈ దొంగతనం చేసినట్లు గుర్తించి చీపురుపల్లి సివిల్‌జడ్జి కోర్టులో సాక్ష్యాధారాలతో ప్రవేశపెట్టామని చెప్పారు. సాక్ష్యాధారాల పరిశీలన అనంతరం నక్కా శివను ముద్దాయిగా మెజిస్ట్రేట్ నిర్ధారించి జైలు శిక్ష విధించారని వివరించారు. దొంగిలించిన బంగారు ఆభరణాలను కోర్టు ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు అందించామని తెలిపారు.

సారా రవాణా, నిల్వలపై దాడులు



స్వాధీనం చేసుకున్న సారా క్యాన్లతో సీఐ ఉపేంద్ర, సిబ్బంది

పార్వతీపురం: సారా రవాణా, నిల్వలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని పెద రెల్లివీధి సమీపంలోని చెరువులో సారా దాచారన్న సమాచారం మేరకు ఎస్ఈబీ సిబ్బంది దాడులు చేసి 200లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో పార్వతీపురం మండలం బుదురువాడ గ్రామం వద్ద వాహన తనిఖీలు చేపట్టి 80లీటర్ల సారాతో ద్విచక్రవాహనంపై వస్తున్న ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

రాజాంలో ఒడిశా వాసి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

రాజాం సిటీ: ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి స్థానిక శ్రీకాకుళం రోడ్డులో మంగళవారం రాత్రి మృతి చెందాడు. స్థానికంగా ఉన్న దుకాణదారులు బుధవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకున్న ఎస్సై వీబీ రామకృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి దగ్గర లభ్యమైన ఆధార్, ఐడీ కార్డుల ఆధారంగా ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన ప్రకాశ్ చంద్రభయ్యాన్(50)గా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు వచ్చిన మృతుడి బంధువులు మాట్లాడుతూ చెన్నైలోని ఎల్‌అండ్‌టీ కంపెనీలో చంద్రభయ్యా పనిచేసేవాడని చెప్పారు. స్వగ్రామం వస్తూ మార్గమధ్యంలో రాజాంలో దిగిన ఆయన అపోలో పక్కనున్న ఖాళీ స్థలంలో మృతిచెందాడని సీఐ తెలిపారు. మృతుని బంధువుల వద్ద వివరాలు సేకరించి మృతదేహాన్ని అప్పగించామన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹70	₹150	₹ 160

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- జొన్నవలస పాఠశాల తనిఖీ



విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం రూరల్: విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతోపాటు, కెరీర్ గైడెన్స్ ఎంతో ముఖ్యమని, వారి భవిష్యత్తుకు ఒక మార్గం చూపాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఉపాధ్యాయులను ఆదేశించారు. విజయనగరం మండలం జొన్నవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, కలెక్టర్ సూర్యకుమారి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పది, ఎనిమిది, ఏడవ తరగతుల విద్యార్థులతో మాట్లాడి, వారి అభ్యసన స్థాయిని తెలుసుకున్నారు. విద్యార్థులు సాధించిన మార్కులు, వారి లక్ష్యాలపై ప్రశ్నించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు. బైజూస్ కంటెంట్ ద్వారా జరుగుతున్న పాఠ్యాంశాల బోధన, పరీక్షలపై ఆరా తీశారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ట్యాబ్‌లను పాఠశాలకు తీసుకువచ్చేలా ఉపాధ్యాయులు చూడాలని చెప్పారు. బైజూస్ పాఠాలు ఎంత వరకు అర్థం చేసుకున్నారో తెలుసుకోవాలని, విద్యార్థులు ఎక్కువగా పరీక్షలు రాసేలా ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యోగాలే కాకుండా, స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేయడం ద్వారా కూడా అభివృద్ధి సాధించవచ్చని అభిప్రాయపడ్డారు.

పునఃశ్చరణ ముఖ్యం

పాఠ్యాంశాల పునఃశ్చరణ ఎంతో ముఖ్యమని పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ప్రతి సబ్జెక్టులో కనీసం 90శాతం మార్కులు సాధించే దిశగా కృషి చేయాలన్నారు.

భాషా పరిజ్ఞానం పెంచుకోవాలి

భాషా నైపుణ్యాన్ని పెంచుకునేందుకు విద్యార్థులు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. దీనికోసం చిన్న చిన్న ఆంగ్ల కథల పుస్తకాలు, ఆంగ్ల దినపత్రికలను చదవాలని సూచించారు. అలాగే ప్రతిరోజూ కొద్ది సమయం గ్రంథాలయంలో గడపాలని, అందుబాటులో ఉన్న పుస్తకాలను చదివి సమకాలీన అంశాలను తెలుసుకోవాలని చెప్పారు. కేవలం పుస్తకాలకే పరిమితం కాకూడదని డిక్షనరీ వాడకం అలవాటు చేసుకుని, కొత్త పదాలకు అర్థం తెలుసుకోవాలని సూచించారు. ఉన్నత చదువు చదవడానికి ఇప్పుడు ఎన్నో అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, విద్యారుణాలను కూడా పొందవచ్చని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి, ఆహార పదార్థాలను రుచిచూశారు.

సఖిపై దృష్టి పెట్టాలి

సఖి గ్రూపులపై దృష్టిపెట్టి వివిధ అంశాలను విద్యార్థులకు బోధించాలని, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఆడపిల్లలు కనీసం డిగ్రీ వరకు చదువు కొనసాగించేలా వారిని చైతన్య పరచాలన్నారు.

ఓటుకు ఆధార్‌ను అనుసంధానించాలి

ఓటుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను శతశాతం పూర్తి చేయాలని, బీఎల్‌ఓలను కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో ఓటర్ల సవరణ ప్రక్రియ, ఆధార్ అనుసంధానం, కొత్త ఓటర్ల నమోదు, ఎంఎల్‌సీ ఓటర్ల చేర్పుపై బీఎల్‌వోలను ప్రశ్నించారు. 6 బి ద్వారా ఓటుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను ప్రతి గ్రామంలో శతశాతం పూర్తి చేయాల్సిన బాధ్యత బీఎల్‌ఓలదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. పర్యటనలో ఎంఈఓ విజయలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం ఈపు విజయ కుమార్, ఉపాధ్యాయులు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యల్లారమ్మ జాతర నిర్వహణపై సమీక్ష



జాతర నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్

జామి: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన జామి యల్లారమ్మ జాతర ఈనెల 26నుంచి 28వరకు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు, చేపట్టవలసిన చర్యలు తదితర అంశాలపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ముందుగా గతంలో జరిగిన ఉత్సవ ఏర్పాట్లపై అధికారులతో చర్చలు జరిపారు.అనంతరం ఈఏడాది జాతరకు తీసుకోవలసిన జాగ్రత్తలపై శాఖల వారీగా చర్చించారు. ఈ ఏడాది జాతరకు సంబంధించి ఉచితదర్శనం క్యూల ఏర్పాటు, భక్తులు ఎండ తీవ్రతకు గురికాకుండా టెంట్‌లు అధికంగా వేయడం, ఉత్సవ నిమిత్తం వసూలు చేసిన అన్ని రకాల వసూళ్లకు దేవదాయశాఖ ద్వారా ముద్రించిన రశీదులు ఇవ్వాలని నిర్ణయించారు. అనధికార వసూళ్లు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీఐపీ పాస్‌లు విధిగా దేవదాయశాఖ ఈఓ సంతకంతో సరఫరా చేయాలని, ఎన్ని పాస్‌లు ముద్రించారో ముందుగా పోలీస్ శాఖకు అందించాలని స్పష్టం చేశారు. ఆలయ ప్రాంగణం ముందు మందుగుండు సామగ్రి పేల్చే ప్రాంతం వద్ద ఫైర్ సేఫ్టీ వాహనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆలయం ఇన్, అవుట్ గేట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అమ్మవారి ఊరేగింపు జరిగే ప్రాంతాల వద్ద అదనంగా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయడానికి సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, ఎండోమెంట్ ఈఓ ప్రసాదరావు, సీఐ సింహాద్రినాయుడు, ఎస్సై వీరబాబు, ఇరిగేషన్ ఏఈ కృష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఝాన్సీ, ఎలక్ట్రికల్, వైద్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శంబర పాఠశాలను సందర్శించిన రాష్ట్రస్థాయి పరిశీలకుడు



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్రస్థాయి పరిశీలకుడు

మక్కువ: మండలంలోని శంబర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (అభ్యసన అభివృద్ధి కార్యక్రమం) రాష్ట్ర స్థాయి పరిశీలకుడు డాక్టర్ ఎస్.టి.చైతన్య బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న 6,7,8వ తరగతుల విద్యార్థులతో ముచ్చటించారు. ఇంతవరకు ఎంత సిలబస్ పూర్తయిందో తెలుసుకుని విద్యార్థుల స్థాయిని పరిశీలించారు. ఉపాధ్యాయుడు బోధించిన పాఠ్యాంశాలను చక్కగా విని, ఎప్పటికప్పుడు సిలబస్ పూర్తి చేసి, పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో నాడు, నేడు నిధులతో చేపట్టిన అదనపు తరగతి భవన నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, ఎంఈవో వి.మల్లేశ్వరరావు, హెచ్‌ఎం ఎం.నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ చోరులకు షాక్..!

- ఆకస్మిక తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్న అధికారులు
- 2022లో నమోదైన కేసులు 2703
- విధించిన అపరాధ రుసుం రూ.3.94 కోట్లు



విజయనగరం ఫోర్ట్: లైటింగ్స్, ప్రైవేట్ ఫంక్షన్స్‌కు విద్యుత్ లైన్ నుంచి కొంత మంది అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుంటారు. మరి కొంతమంది గృహ విద్యుత్ మీటర్‌తో చిన్నపాటి పిండి మిల్లులు, దుకాణాలు వంటివి నిర్వహిస్తుంటారు. ఈ చర్యల వల్ల విద్యుత్‌శాఖకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లుతోంది. ఇటువంటి వారిపై విద్యుత్‌శాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమంగా విద్యుత్ వినియోగించేవారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు	
కేటగిరి	కనెక్షన్ల సంఖ్య
కేటగిరి-1	6,41,271
కేటగిరి-2	74,288
కేటగిరి-3	3,606
కేటగిరి-4	12,696
హెచ్‌టీ	388
వ్యవసాయం	37,163

2022లో నమోదైన కేసులు 2703:

విద్యుత్‌శాఖకు చెందిన విద్యుత్ చౌర్య విభాగం(విజిలెన్స్), ఆపరేషన్ ఇంజినీర్స్ వేర్వేరుగా తనిఖీలు చేపడుతున్నాయి. 2022లో చేపట్టిన తనిఖీల్లో 2703 కేసులు నమోదు చేశారు. వాటికి సంబంధించి అపరాధ రుసుం రూ.3.94 కోట్లు విధించారు. ఈ కేసుల్లో విద్యుత్ చౌర్యం 1014, అనధికారికంగా విద్యుత్ వాడేవి 112, అదనపులోడుకేసులు 1399 ఉన్నాయి.

అదనపు వాడకానికి అనుమతి అవసరం

అదనపు లోడ్ వాడాలనుకుంటే విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలి. కేటగిరి-1 కనెక్షన్ తీసుకుని షాపులకు వినియోగించడం నేరం. విద్యుత్ అక్రమంగా వినియోగించినట్లయితే విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ ఇంజినీర్స్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తారు.

పి. నాగేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ

అనుమానంతో దాడి



చికిత్స పొందుతున్న అనంత్

పార్వతీపురం: స్నేహితుల మధ్య అనుమానం వచ్చి దాడి చేసిన ఘటనలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటనపై పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలి ఉన్నాయి. సీతానగరం మండలం చినభోగిలికి చెందిన సీహెచ్.అనంత్‌ను అదే గ్రామానికి చెందిన కె.భరత్ ఫోన్ చేసి పెట్రోల్ బంకు వద్దకు రమ్మని పిలిచాడు. ఈమేరకు పెట్రోల్ బంకు వద్దకు అనంత్ వెళ్లగా తన చెల్లికి ఫోన్ చేస్తున్నాడన్న అనుమానంతో అనంత్ చెంపపై భరత్ కొట్టాడు. భరత్‌తో పాటు స్నేహితులు వినయ్, చందులు అనంత్‌ను పట్టుకోగా భరత్ చాకుతో అనంత్ ఎడమచేతిని గాయపరిచాడు. అలాగే ముఖంపై కొట్టాడు. ఈ మేరకు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం బంధువులు అనంత్‌ను తరలించారు. ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.42 లక్షలతో జంగిల్ క్లియరెన్స్



జంగిల్ క్లియరెన్స్ పనులు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. రూ.42 లక్షలతో వివిధ రకాల మరమ్మతులు చేపట్టనున్నట్లు డీఈ నర్మదా పట్నాయక్ తెలిపారు. తొలిరోజు మడ్డువలస గ్రామం నుంచి ప్రాజెక్టు రోడ్డులో పనులు చేపట్టారు.

విశ్రాంత ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఎన్నిక



విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం

బొబ్బిలి: విశ్రాంత ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఎన్నిక బొబ్బిలిలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా కార్యవర్గం జిల్లా అధ్యక్షుడిగా రౌతురామమూర్తినాయుడు, అసోసియేట్ అధ్యక్షులుగా ఎల్.జగన్నాథం, చల్లా వెంకటరావు, జనరల్ సెక్రటరీగా రెడ్డి కృష్ణమూర్తినాయుడు, ట్రెజరర్‌గా ఎల్.సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పి.సత్యం నాయుడు, కోలబలరాం, వంతరాం శ్రీరామమూర్తి, కొంచాడ సత్యరాజు, రేజేటి నాగేశ్వరరావు, జాయింట్‌సెక్రటరీలుగా గొట్టాపు ఆదినారాయణ, బొత్స పారినాయుడు, గురాన కృష్ణమూర్తి, నిడదాన అప్పారావులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కందుకూరి తవిటయ్య, ఈడుబిల్లి నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. వారి పదవీకాలం మూడేళ్లు. ఎన్నికైన సభ్యులంతా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించి, సంఘం బలోపేతానికి కృషిచేస్తామంటూ పలు తీర్మానాలు చేశారు.నూతన కార్యవర్గసభ్యులను పలువురు అభినందించారు.

ముద్రణ సంస్థలు ఎన్నికల నిబంధనలు పాటించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ వెంకటరావు

పార్వతీపురం: ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన ఆయన మాట్లాడుతూ ఎన్నికల కరపత్రాలు, పోస్టర్ల ముద్రణ, ప్రచురణ చేసే ప్రింటింగ్ ప్రెస్ యజమానులు కేంద్ర ఎన్నికల కమిషనర్ జారీ చేసిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. కరపత్రాలు, పోస్టర్ల ముద్రణ, ప్రచురణ చేసే ముందు పోటీలో ఉన్న అభ్యర్థి ఆధార్ కార్డు, సెల్ఫ్ డిక్లరేషన్, ఇద్దరు సాక్షుల సెల్ఫ్‌డిక్లరేషన్‌ను ప్రిటింగ్ ప్రెస్ యజమానులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మల్టీగ్రాఫ్ ఎన్నికల కరపత్రం, బిల్లు, ప్లకార్డులు, పోస్టర్ ముందు భాగంలో ప్రింటర్ పేరు, చిరునామా తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రింటర్లు స్థానిక జిల్లా మెజిస్ట్రేట్‌కు వివరాలను సమర్పించాలని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమించిన ప్రింట్ యజమానికి ఆరు నెలలు జైలు, జరిమానా లేదా రెండు విధిస్తారని పేర్కొన్నారు. ముద్రించిన కరపత్రాలు, పోస్టర్ల నాలుగు కాపీలను ప్రింటింగ్ యజమాని సెల్ఫ్ డిక్లరేషన్‌ను ప్రింట్ చేసిన పది రోజులలోపు ప్రధాన ఎన్నిక అధికారి కార్యాలయానికి పంపాలన్నారు. ప్రింటింగ్ ప్రెస్ ద్వారా అందిన ఎన్నికల పోస్టర్లు, కరపత్రాలను జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయాల ఆవరణలో ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రధాన ఎన్నికల అధికారి నిర్దేశించిన నిబంధనలను అతిక్రమించిన ప్రింటింగ్ ప్రెస్ యజమానులపై సెక్షన్ 127-ఎ ప్రకారం జిల్లా మెజిస్ట్రేట్, జిల్లా అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనా అధికారి ఆర్.ఉమామహేశ్వరరావు, ప్రింటింగ్ ప్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ సమగ్రత శిబిర కంటింజెంట్ ఇన్‌చార్జ్‌గా హరిబాబు



హరిబాబుకు నియమక పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ రామారెడ్డి

డెంకాడ: జాతీయ సమగ్రత శిబిరానికి ఆంధ్రప్రదేశ్ కంటింజెంట్ ఇన్‌చార్జ్‌గా జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీవో తమ్మినేని హరిబాబు ఎంపికయ్యారు. ఏటా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జాతీయ సమగ్రత శిబిరానికి జేఎన్‌టీయూకే, జీవి యూనివర్సిటీల నుంచి 10 మంది విద్యార్థులు ఈ ఏడాది ఎంపికయ్యారు. రాష్ట్ర సంస్కృతి,ఆచార వ్యవహారాలు, స్థితిగతులను వివరించే దిశగా జిల్లా విద్యార్థులను తయారు చేసి, వారు శిబిరంలో పాల్గొనేలా చేసే బాధ్యతలకు తమ్మినేని ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 24 వరకూ బెంగాల్‌లోని వర్ధమాన్ యూనివర్సిటీలో జాతీయ సమగ్రత శిబిరం జరుగుతుందని తెలిపారు. 26 రాష్ట్రాల నుంచి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొని దేశ సంపద, ఔన్నత్యం, రాష్ట్రాల మధ్య సమన్వయ భావన, సంస్కృతి, సంప్రదాయాలపై యువత పాత్రపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి నియామక పత్రాన్ని హరిబాబుకు బుధవారం అందజేసి అభినందించారు.

చెట్టును ఢీకొన్న టాటా ఏస్: ఒకరి మృతి



చెట్టును ఢీకొన్న టాటా ఏస్



మృతి చెందిన చంద్రశేఖర్

గుర్ల: పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న టాటా ఏస్ వాహనం చెట్టును కొట్టడంతో ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. చీపురుపల్లి నుంచి ప్రయాణికులతో వస్తున్న టాటా ఏస్ వాహనం గుర్ల మండలంలోని అచ్యుతాపురం వద్ద చెట్టును ఢీకొట్టింది. బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటకు చెందిన పాట్నూరు చంద్రశేఖర్(47) తీవ్ర గాయాల పాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మరో ముగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా విజయనగరం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. కొత్తవలసలో జరిగే ఒక వివాహానికి వెళ్తుండగా టాటా ఏస్ వాహనం ప్రమాదానికి గురైనట్లు ఎస్సై శిరీష తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఎం...

సాలూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ప్రమాదంలో ఓ ఏఎస్ఎం మృతి చెందింది. మండలంలోని చీపురువలస గ్రామ సమీపంలో బుధవారం జరిగిన ఈ సంఘటనపై రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మక్కువ మండలం శంబర పీహెచ్‌సీలో ఏఎస్ఎంగా విధులు నిర్వహిస్తున్న సాలూరు మండలం కూర్మరాజు పేట గ్రామానికి చెందిన గుమ్మడి ఆదిలక్ష్మి బుధవారం పీహెచ్‌సీలో విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై కూర్మరాజు పేట వైపు వస్తుండగా చీపురువలస గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆదిలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి, వెంటనే సమీపంలో ఉన్న మామిడిపల్లి పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించి సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలి భర్త వెంకటరమణ ట్రాక్టర్‌షోరూంలో పని చేస్తున్నాడు. వారికి 12 సంవత్సరాల అమ్మాయి కీర్తన, ఎనిమిది సంవత్సరాలు అబ్బాయి నిఖిల్ ఉన్నారు.



పిల్లలతో మృతురాలు ఆదిలక్ష్మి (ఫైల్)

అంచనాలకు మించి చిత్ర నిర్మాణం

- 18న 'వినరో భాగ్యము విష్ణుకథ' విడుదల
- ప్రి రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నటుడు కిరణ్ అబ్బవరం



మాట్లాడుతున్న చిత్ర హీరో కిరణ్ అబ్బవరం

విజయనగరం టౌన్: ప్రేక్షకుల అంచనాలకు మించి చిత్రాన్ని అద్భుతంగా రూపకల్పన చేశామని నటుడు కిరణ్ అబ్బవరం పేర్కొన్నారు. స్థానిక ఎస్‌వీసీ రంజని థియేటర్‌లో బుధవారం ప్రి రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్ఆర్.కల్యాణ మండపం చిత్రం 11వ రోజు ఇక్కడికి వచ్చి సినిమా చూసి వెళ్లిపోయానని, మళ్లీ ఇప్పుడు రావడం ఆనందంగా ఉందన్నారు. 'వినరో భాగ్యము విష్ణు కథ' చాలా ప్రత్యేకమైన సినిమా. గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో అల్లు అరవింద్ సారథ్యంలో బన్నివాస్ నిర్మాణంలో నిర్మాణం పూర్తి చేసుకుని ఈ నెల 18న మహాశివరాత్రికి చిత్రం విడుదల కానుందని చెప్పారు. గత చిత్రాలకంటే ఈ చిత్రం అందరికీ బాగా నచ్చుతుందన్నారు. సినిమాలో హీరోయిన్‌గా కశ్మీర పరదేశి, మురళీ శర్మ, ఆమని, దేవీప్రసాద్, ప్రవీణ్, ఎల్‌బీ శ్రీరామ్, శుభలేఖ సుధాకర్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారన్నారు. మరో మూడురోజుల్లో సినిమా మీ ముందు ఉండబోతుందన్నారు. కార్యక్రమంలో చిత్రయూనిట్ వినోద్, కనకరాజు, థియేటర్ మేనేజర్ సాయిప్రసాద్, రాజశేఖర్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

గజపతినగరం: వరుసకు మరదలైన మైనర్‌ను తీసుకుపోయి లైంగికదాడికి పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుర్ల మండలం దమరసింగి గ్రామానికి చెందిన దనాల రాము వరుసకు మరదలైన బాలికను ఇటీవల తీసుకు పోయి లైంగికదాడికి పాల్పడ్డాడని అందిన ఫిర్యాదు మేరకు బొబ్బిలి డీఎస్పీ బి.మోహన్ రావు గజపతినగరం సర్కిల్ ఆఫీస్‌లో విచారణ చేశారని చెప్పారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.